https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మన్ : పార్వతి సురేష్ కుమార్

ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 353 శుక్రవారం 3-4-2026 పేజీలు : 4

**రిపోర్టర్స్ కావలెను**

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## భారత రక్షణ ఎగుమతులు రూ. 38,424 కోట్లు

### 2025-26లో రికార్డు స్థాయిలో 62 శాతం వృద్ధి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:**
భారత రక్షణ ఎగుమతులు 2025–26 ఆర్థిక సంవత్సరంలో సరికొత్త రికార్డును సృష్టించాయి. మొత్తం ఎగుమతులు రూ. 38,424 కోట్లకు చేరి గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 62శాతం వృద్ధిని నమోదు చేశాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. గురువారం సోషల్ మీడియా ద్వారా ఆయన స్పందిస్తూ.. రక్షణ ఎగుమతుల్లో వచ్చిన ఈ భారీ పెరుగుదల భారత రక్షణ సామర్థ్యాలపై ప్రపంచ దేశాల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా రక్షణ ఎగుమతుల్లో భారత్ సరికొత్త విజయగాథను లిఖిస్తోందన్నారు. ఈ ఎగుమతుల్లో ప్రభుత్వరంగ రక్షణ సంస్థల వాటా 54.84 శాతం కాగా, ప్రైవేటు సంస్థల వాటా 45.16శాతం ఉంది. భారత్ ప్రస్తుతం 80 కంటే ఎక్కువ దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోంది. ఎగుమతి సంస్థల సంఖ్య 128 నుంచి 145కు పెరిగింది. భారత రక్షణరంగ ఎగుమతులు 2024–25లో రూ.23,622 కోట్లున్నాయి.

## గ్యారంటీలపై సందేహాలుంటే

# తెలంగాణకు రండి

### - అమలు తీరును ప్రత్యక్షంగా చూపిస్తాం - కేరళ సీఎంకు రేవంత్‌రెడ్డి ఆహ్వానం



**హైదరాబాద్, మార్చి 2:**
కేరళ యూడీఎఫ్ ప్రకటించిన 5 గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వాళ్లు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి.. తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులు తెలంగాకు వస్తే తాము గ్యారెంటీలను ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపిస్తామంటూ ఆహ్వానించారు. కేరళలో పినరయి విజయన్ పాలన ముగిసిందని, ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలు కానుందని ధీమా వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్రం కొచ్చిలో గురువారం యూడీఎఫ్ ఎన్నికల మేనిఫెస్టోను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీ, పినరయి విజయన్‌లను రాజకీయ సోదరులుగా పోల్చారు. ఒకరు ఢిల్లీని పాలిస్తుంటే.. మరొకరు కేరళను పాలిస్తున్నారన్నారు. దేవుడి సొంత భూమి కేరళలో దేవుడి ఆస్తికి రక్షణ లేకుండా పోయిందని శబరిమల బంగారం దారి మళ్లింపు ఘటనను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అవినీతి, అసమర్థ, కుటుంబ పాలన విషయంలో పినరయి విజయన్, కేసీఆర్‌లకు దగ్గర పోలికలు ఉన్నాయని రేవంత్ అన్నారు. 2014 నుంచి దాదాపు పదేళ్ల పాటు తెలంగాణను కేసీఆర్ పాలిస్తే పదేళ్లుగా కేరళలో విజయన్ పరిపాలిస్తున్నారని చెప్పారు. 2023 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను గద్దె దించినట్లుగానే ఈ ఎన్నికల్లో కేరళ ప్రజలు విజయన్‌ను గద్దె దింపుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. "పో మోనే విజయా" డైలాగ్‌పై మీడియా అడిగిన ప్రశ్నకు రేవంత్ స్పందిస్తూ, విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అని, విమర్శ చేయకుండా ఎలా ఉంటామని బదులిచ్చారు. అవినీతి నియంత్రణ, పన్ను వసూళ్లలో లీకేజీలను అరికట్టడం, కేంద్ర పథకాలను వినియోగించుకోవడం, కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన నిధులను రాబట్టుకోవడం తమ ప్రాధాన్య అంశాలని సీఎం రేవంత్ చెప్పారు. కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధులు ఏమీ ప్రధాని మోదీ కరుణ చూపడంతో వచ్చేవి కావని, అవి రాష్ట్రాల ప్రజల హక్కు అని స్పష్టం చేశారు.

**తొలి క్యాబినెట్ నుంచే హామీలను అమలు**

యూడీఎఫ్ ఐదు గ్యారెంటీలు అమలు సాధ్యమా అంటున్న వారికి సమాధానం తెలంగాణ రాష్ట్రమేనని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల మేర రుణాలను మాఫీ చేశామని తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికి 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటినిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. 500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.



## నేటి నుంచి మహేశ్ గౌడ్ జిల్లాల పర్యటన

**హైదరాబాద్, ఏప్రిల్ 2**
టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లాల్లో పర్యటించనున్నారు. కొత్తగా ఏర్పాటైన డీసీసీ కార్యవర్గ సమావేశాల్లో పాల్గొనేందుకు మహేశ్ గౌడ్.. జిల్లాల పర్యటనను గతంలోనే ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో తన జిల్లా పర్యటనకు విరామం ఇచ్చారు. శుక్రవారం నుంచి తన పర్యటనను తిరిగి ప్రారంభిస్తున్నారు. ఈ రెండు రోజుల్లో నాలుగు జిల్లాలు పర్యటించి.. ఆయా డీసీసీల కార్యవర్గాలతో సమావేశమవుతారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై ఈ సమావేశాల్లో దిశానిర్దేశం చేయనున్నారు. కాగా, గాంధీభవన్‌లో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమం టీపీసీసీ కల్లు గీత కార్మిక విభాగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

# 'భూభారతి'తో భూ సమస్యలు పరిష్కారం




**ఆమనగల్లు, ఏప్రిల్ 2**
రాష్ట్రంలో రెవెన్యూ సంస్కరణలలో భాగంగా ప్రజలకు పారదర్శక సేవలు అందించేందుకు, భవిష్యత్‌లో భూ సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమీకృత భూ భారతి పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు రెవెన్యూ శాఖ, హౌసింగ్, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివ్ష?సరెడ్డి తెలిపారు. ఈ కొత్త విధానంలో భూ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామన్నారు. భూము ల రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే నెంబర్‌కు సబంధించి భూదార్ నంబర్ ఇవ్వడంతో పాటు సరిహద్దులు, పక్కా కొలతలతో కూడిన మ్యాప్‌లను డాక్యుమెంట్‌తో పాటు అందించనున్నట్లు పేర్కొన్నారు. పక్కా ఆధారాలతోనే ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మునిసిపాలిటి పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన సమీకృత భూ భారతి పోర్టల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివ్ష?సరెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రెవెన్యూశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతుల భూములకు భద్రత, భరోసా కల్పించేలా భూ భారతి చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేస్తామని చెప్పారు. భూములు అమ్ముకున్న, కొనుగోలు చేసిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇకపై ఏ రైతు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా భూ భారతి పోర్టల్‌ను తెచ్చామన్నారు. ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో 45 రోజుల తర్వాత వచ్చే ఫలితాలను బట్టి మార్పులు, చేర్పులు చేసి రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక మండలంలో, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా భూ భారతి పోర్టల్ అమలు చేస్తామని తెలిపారు.

# ఎవరి కోసం ఈ యుద్ధం?

### అమెరికా ప్రజలారా.. మీతో మాకు ఏ విధమైన శత్రుత్వం లేదు

### విధ్వంసంతో పసిపిల్లల్ని హత్య చేస్తున్నారు.. ఇది పరాక్రమమా?

### ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ బహిరంగ లేఖ



**టెహ్రాన్, ఏప్రిల్ 2:**
ఇరాన్ మీద ఏకపక్ష దాడుల్ని ప్రారంభించి ఆ దేశ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ తదితరుల్ని బలిగొన్న తర్వాత.. ట్రంప్ గత నెల తొలివారంలో ఇరానీయుల్ని ఉద్దేశించి ఓ పిలుపునిచ్చారు. 'కొన్ని తరాలకుగానీ రాని అవకాశం మీకు కల్పిం చాం.. ప్రభుత్వాన్ని మీ చేతుల్లోకి తీసుకోండి!' అని పేర్కొన్నారు. అయితే, ఆయన ఊహించినదానికి భిన్నంగా ఇరాన్ ప్రజలు తమ ప్రభుత్వం వెంట బలంగా నిలబడ్డారు. అందుకే, ఆ దేశం అమెరికా, ఇజ్రాయెల్‌ల సంయుక్త దాడిని దీటుగా ఎదుర్కొంటోంది. మరోవైపు, ఇరాన్‌పై యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ అమెరికాలో పలు నగరాల్లో ప్రజలు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యం లో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అమెరికా ప్రజల్ని ఉద్దేశించి గురువారం ఓ బహిరంగ లేఖ రాశారు. 'అమెరికా ప్రజలారా! మాతో ఎటువంటి సమస్య లేకపోయినా మీ అధ్యక్షుడు మా మీద ఎందుకు యుద్ధం చేస్తున్నారో గుర్తించండి. ఆయుధాల కంపెనీల కోసం, ఇజ్రాయెల్ కోసం ఈ యుద్ధంలోకి దిగారు. మీ సైనికుల ప్రాణాల్ని బలి పెడుతున్నారు. మీరు కట్టిన పన్నుల్ని నీళ్లలాగా ఖర్చు చేస్తున్నారు. సాధారణ ప్రజలైన మీతో మాకు ఎటువంటి శత్రుత్వం లేదు' అని పేర్కొన్నారు. మూడు పేజీల ఈ లేఖలో ఇరాన్ ప్రాచీన నాగరికత నుంచి నేటి పరిస్థితుల వరకూ స్థూలంగా, సూటిగా తన అభిప్రాయాలను పెజెష్కియాన్ వెల్లడించారు. 'మానవ చరిత్రలోనే ఇప్పటికీ కొనసాగుతున్న అతి ప్రాచీన నాగరికతల్లో మాదొకటి. చారిత్రకంగా, భౌగోళికంగా, సైనికపరంగా మాకు అనుకూలతలు ఉన్నప్పటికీ మేం మా ఆధునిక చరిత్రలో ఎన్నడూ ఇతర ప్రాంతాల మీద ఆక్రమణకు, ఆధిపత్యానికి, యుద్ధానికి దిగలేదు. అదే సమయంలో, మా మీద ఎవరైనా దాడులు చేస్తే వాటిని ప్రతిసారీ విజయవంతంగా తిప్పికొట్టాం. మాకు ఏ దేశం మీదా శత్రుత్వం లేదు. అంతేకాదు, ప్రభుత్వాలకు.. అవి పాలించే ప్రజలకు మధ్య తేడా ఉందన్న విషయంలో ఇరాన్ ప్రజలకు స్పష్టత ఉంది. ఇది మా సంస్కృతిలో, మా సమష్టి చేతనలో ఒక భాగం. కాబట్టి, ఇరాన్‌ను ఒక శత్రువు గా చూపటం అనేది చారిత్రకంగా చూసినా, ప్రస్తుత పరిస్థితుల ప్రకారమైనా సరైనది కాదు. అయినప్పటికీ సైనిక ఆధిపత్యం, ఆయుధ పరిశ్రమ, వ్యూహాత్మక మార్కెట్ల మీద నియంత్రణ కోసం కొన్ని బలీయమైన శక్తులు ఇరాన్‌ను ఒక బూచిగా చూపుతున్నాయి. లేని శత్రువును ఉన్నట్లు సృష్టిస్తున్నాయి' అని పెజెష్కియాన్ పేర్కొన్నారు.



# అమరావతి ఇక శాశ్వతం!

### - పార్లమెంటు చట్టం.. తిరుగులేని శాసనం - 'చట్టబద్ధత'ను ఓర్వలేకే జగన్ డ్రామాలు

### - వాకౌట్ చేసిన ఆ పార్టీని బ్లాకౌట్ చేయాలి - పార్లమెంటు చట్టం తిరుగులేని శాసనం: సీఎం చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 2**
ప్రజా రాజధాని అమరావతి, దాని నిర్మాణం కోసం రైతులు చేసిన త్యాగాలు శాశ్వతంగా ఉంటాయని, ఇకపై అమరావతిని ఎవరూ టచ్ చేయలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చరిత్ర ఉన్నంత వరకు అమరావతి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడం ద్వారా తిరుగులేని శాసనాన్ని లిఖించారని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెంలో గురువారం సాయంత్రం నిర్వహించిన 'అమరావతి విజయోత్సవ సభ'లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అమరావతి బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపిన ఈ రోజు.. ప్రజాస్వామ్య గొప్పతనాన్ని, ప్రజల సంకల్ప బలాన్ని చాటి చెప్పిన రోజు' అని పేర్కొన్నారు. అనేక కుట్రలను దాటుకుని అమరావతిని రక్షించుకున్నామని, ప్రజా రాజధానిని సాధించుకున్నామన్నారు. రాష్ట్ర రాజధానికి పార్లమెంటు చట్టబద్ధత కల్పించడాన్ని ప్రజా విజయంగా ఆయన అభివర్ణించారు. అమరావతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ధన్యవాదాలు తెలిపారు. అన్ని పార్టీలు అమరావతికి సహకరించి, దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజుగా మార్చాయని ఆనందం వ్యక్తం చేశారు. "పార్లమెంటులో అమరావతికి తిరుగులేని శాసనం చేసుకున్నాం. పార్లమెంటులో అమరావతి బిల్లు పెడితే దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతికి అండగా నిలబడినా.. ఒకే ఒక్క దిక్కుమాలిన పార్టీ వైసీపీ మాత్రం వ్యతిరేకించింది. ఇంతటి నీతిమాలిన రాజకీయం నా చరిత్రలో చూడలేదు. ఆ పార్టీ నేతలు అమరావతిని శ్మశానం అన్నారు. రాజధానితో మూడు ముక్కలాట ఆడారు. అడ్రస్ లేకుండా పోయారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడాన్ని ఓర్వలేని జగన్.. మావిగన్ అంటూ ఓ కొత్త ప్రతిపాదనతో డ్రామాకు తెరలేపారు.

## 16 నుంచి

# మళ్లీ పార్లమెంట్

### మూడు రోజుల పాటు నిర్వహణ

### మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం

### ఆగమేఘాలపై మహిళా బిల్లు ఎందుకు పెడుతున్నారు: కాంగ్రెస్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2**
చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను కల్పించే నారీ వందనా అధినియమ్‌ను ప్రవేశపెట్టాలన్న కృతనిశ్చయంతో ఉన్న మోదీ ప్రభుత్వం ఈ నెల 16 నుంచి మూడు రోజులపాటు పార్లమెంట్ ఉభయ సభలను మళ్లీ సమావేశపరచాలని నిర్ణయించింది. గురువారం సాయంత్రం ఉభయ సభలు ప్రోరోగ్ కావడానికి బదులు వాయిదా పడ్డాయి. తాము బడ్జెట్ సమావేశాలనే ప్రస్తుతం వాయిదా వేసి మళ్లీ రెండు మూడు వారాల్లో ప్రారంభించాలనుకుంటు న్నామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు గురువారం తెలిపారు. బడ్జెట్ సమావేశాలను మళ్లీ సమావేశపరుస్తారా అని కాంగ్రెస్ నేత జైరాంరమేశ్ రాజ్యసభలో అడగడంతో ఆయన ఈ విషయం వెల్లడించారు. కేవలం రాజకీయ కారణాల వల్లే మహిళా బిల్లును ఆగమేఘాలపై ప్రవేశపెడుతున్నారని, ఎన్నికల కోడ్‌కు ఇది విరుద్ధమని జైరాంరమేశ్ వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు. 30 నెలలుగా ఈ విషయంలో ఎందుకు నిర్ణయం తీసుకోలేదని, జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడతామన్నవారు ఇప్పుడెందుకు ఆ బిల్లును తేవాలనుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిలదీశారు. కాగా ఎన్నికలైన తర్వాత తాము అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ లేఖ రాసిన విషయం ఖర్గే ప్రస్తావించగా అలా సాధ్యం కాదని కిరెణ్ రిజిజు చెప్పారు. ప్రజలకిచ్చిన వాగ్దానం నెరవేర్చడమే తమ కర్తవ్యమని, దానికీ ఎన్నికలకూ సంబంధం లేదన్నారు. ఈ బిల్లును ఇక ఆలస్యం చేయవద్దని తాము ప్రార్థిస్తున్నామని చెప్పారు.

# అసోంలో హిమంత హాలాహలం

సోషల్ మీడియా వివేక రాహిత్య ప్రమాణాల ప్రకారం చూసినా భారతీయ జనతా పార్టీ అసోం శాఖ ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసిన ఓ వీడియో నాగరిక విలువల మరింత భ్రష్టత్వానికి అద్దం పట్టింది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలోనే తొలగించివేసిన ఆ వీడియోలో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఇద్దరు వ్యక్తుల (ఒకరు చిన్న టోపీ ధరించిన వ్యక్తి కాగా మరొకరు నిండు గడ్డంతో ఉన్న వ్యక్తి)పై ఎయిర్ రైఫిల్‌ను పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో గురిపెట్టి ఉన్న దృశ్యం కనిపిస్తుంది. బంగ్లాదేశీ ముస్లిం వలసకారులకు వ్యతిరేకంగాను, అసోం ప్రజల అస్తిత్వాన్ని కాపాడడమే లక్ష్యంగా ఆ వీడియోను రూపొందించినట్టు చెబుతున్నారు. అయితే అందులోని హింసాత్మక మతతత్వ దృశ్యాలను గమనిస్తే అంతకంటే కక్షపూరిత ప్రవర్తన మరొకటి ఉండదని స్పష్టమవుతుంది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన నాయకుడు ముస్లింలపై తుపాకీ గురిపెట్టడమనేది రాజ్యాంగ బాధ్యతల ఉల్లంఘనకు ఒక భయంకర ఉదాహరణ. జిత్తులమారి నాయకుడు అయిన హిమంత అటువంటి వీడియో ఉన్న విషయం తన దృష్టికి రాలేదని అన్నారు. ఆయన వాదాన్ని అంగీకరించేవారు బహుశా ఎవరూ ఉండరు. బీజేపీ అసోం విభాగం స్వయంగా సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసిన వీడియో అది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆ వీడియోను తొలగించే సమయానికి దాన్ని పదిలక్షల మందికి పైగా వీక్షించారు. హిమంత రాజకీయ వైఖరులు తెలిసినవారు ఆ వీడియో గురించి ఆశ్చర్యపోరు. ఇప్పటికి చాలా నెలలుగా 'మియా' (అసోంలో బెంగాలీ మాట్లాడే ముస్లింల గురించి మొరటుగా ప్రస్తావించే పదమది) లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఒక విషపూరిత ప్రచారానికి హిమంత నాయకత్వం వహిస్తున్నారు. ఆర్థిక కార్యకలాపాల నుంచి 'మియా'లను బహిష్కరించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. దుకాణదారులు, కూరగాయల విక్రేతలు, ఆటో రిక్షా డ్రైవర్లు మొదలైన వారందరినీ ఆర్థిక జీవనం నుంచి బహిష్కరించాలని ఆయన నిక్కచ్చిగా చెబుతున్నారు. ఇటువంటి వైఖరిని అనుసరిస్తున్నందుకు ఆయనేమీ విచారం వ్యక్తం చేయలేదు. ఎటువంటి సంజాయిషీలు ఇవ్వలేదు. అసోం సాంస్కృతిక–నాగరికతా విలువలను సంరక్షించుకునేందుకు 'మియా'ల బహిష్కరణ తప్పనిసరి అని ఆయన గట్టిగా వాదిస్తున్నారు. ముస్లింలను నిందిస్తూ తాను నిరంతరమూ చేస్తోన్న వ్యాఖ్యలు, ప్రకటనలు మొదలైనవి ఎన్నికలలో లబ్ధి చేకూరుస్తాయని హిమంత విశ్వసిస్తున్నట్టుగా కనిపిస్తోంది. అధికార దుర్వినియోగంతో ముఖ్యమంత్రి, ఆయన కుటుంబమూ అపరిమితమైన ఆస్తులు సమకూర్చుకున్నారని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. హిమంత రెచ్చగొడుతున్న మతతత్వ భావోద్రేకాలు ఆ ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడమే కాకుండా, వారి మధ్య మతపరమైన విభేదాలనూ సృష్టిస్తున్నాయి. 'బయటి వ్యక్తి'పై ఆగ్రహం, అసహ్యం అసోం సామాజిక జీవన రంగాలలో దశాబ్దాల నుంచీ భాగంగా ఉంటూ వస్తోంది. తమ గడ్డపై తమ సంఖ్య తగ్గిపోతుండడం, బెంగాలీ భాష మాట్లాడేవారి సంఖ్య పెరిగిపోతూ, తమపై వారు ఆధిపత్యం చలాయించడాన్ని అస్సామీ భాష మాట్లాడే ప్రజలు సహజంగానే సహించలేకపోతున్నారు. వారి నిరసనలకు తననుతాను ఒక లౌడ్ స్పీకర్‌గా నిలుపుకోవడంలో హిమంత సఫలమయ్యారు. అసోం జనాభాలో ముస్లింలు 38 శాతం మంది ఉన్నారు. ఈ కారణంగా జనాభాపరమైన మార్పులు, అస్సామీ సంస్కృతి మనుగడకు ఎదురవుతున్న సవాళ్ల విషయమై నిజమైన, ఊహాత్మక భయాందోళనలను రెచ్చగొట్టడం చాలా సులువు. ఈ కారణంగానే సామాజిక మాధ్యమాలలో ప్రత్యక్షమైన ఆ విద్వేషపూరిత వీడియో సందేశం తీవ్ర స్థాయిలో సమస్యాత్మకమైంది. అసోం వెలుపల విద్వేష ప్రసంగంగా పరిగణన అవుతున్నది అసోంలో మాత్రం ఆ గడ్డ ప్రజల చారిత్రక, భాషాపరమైన, సాంస్కృతిక, ఆర్థిక హక్కులను కాపాడేందుకు ఉద్దేశించినది అవుతున్నది. ప్రస్తావిత వీడియో మైనారిటీలకు వ్యతిరేకంగా ఆగ్రహాన్ని రెచ్చగొట్టేదిగా కాకుండా నిత్య జీవితంలో రోజువారీ అనుభవాల ఆధారంగా ఏర్పడే రాజకీయ అవగాహనను ప్రతిబింబించేదిగా సమర్థనీయమవుతున్నది. 2002లో గుజరాత్ అల్లర్లను గుజరాతీ అస్మిత (ఆత్మగౌరవం)ను రక్షించేందుకు చెలరేగినవిగా అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ సమర్థించారు. ఇప్పుడు అసోం పరిణామాలలోనూ అటువంటి వైఖరే వ్యక్తమవుతోంది. అస్సామీ భాషా సంస్కృతులను సంరక్షించేందుకు రాజకీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలలో భాగమే ఆ పరిణామాలు. మరి ఆ వివాదాస్పద వీడియో వ్యవహారంపై బీజేపీ జాతీయ నాయకత్వం మౌనం వహించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అంతర్జాతీయంగా మద్దతు పొందేందుకు 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్' అనే నినాదం ఉపయోగపడవచ్చుగానీ ఎన్నికలు జరగనున్న అసోంలో రాజకీయ లబ్ధిని సమకూర్చుకునేందుకే మతతత్వ భావోద్రేకాలను రెచ్చగొట్టడం అనివార్యమవుతోంది. కనుకనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అసోంను సందర్శించిన ప్రతిసారీ 'అక్రమ చొరబాటుదారుల' గురించి ఆ రాష్ట్ర ప్రజలను హెచ్చరిస్తూ ఉంటారు. అంతర్జాతీయ సరిహద్దుల వద్ద కాపలా ఉండేది కేంద్ర బలగాలే అన్న వాస్తవాన్ని బీజేపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తారు. లౌకికవాద రాజకీయ నాయకులు సైతం మెజారిటీవాద రాజకీయాల ప్రాబల్యానికి తలొగ్గక తప్పలేదు. ఆ వివాదాస్పద వీడియోకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రజాస్వామిక చైతన్యశీలురు అయిన పౌరులు కొంతమంది సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం నొకదాన్ని దాఖలు చేశారు. అయితే రాజకీయ వర్గాలలో హిమంత మతతత్వ రాజకీయాల నెదుర్కొనేందుకు సంకోచిస్తున్నారు. అలా చేస్తే తాము హిందూ ఓటర్లకు మరింతగా దూరమవుతామని వారు భయపడుతున్నారు. రాజకీయ ప్రయోజనాలకు ముస్లింలను బుజ్జగిస్తున్నదని గతంలో కాంగ్రెస్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతుండేవి. ఇప్పుడు మెజారిటీ హిందూ ఓటర్ల మద్దతుకు పోటీ పడడమే రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేస్తోంది. హైదరాబాద్‌లో హిమంతపై పోలీసులకు అసదుద్దీన్ ఓవైసీ ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎన్నికలలో విజయం సాధించేందుకు హిందూ ఓటర్ల మద్దతు అవసరం లేదు కనుకనే ఆయన ఆ పని చేయగలిగారు.

# ప్రజా పాలనలో ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు





**నాగారం, ఏప్రిల్ 2 :**
ప్రజా పాలనలో ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం అని నాగారం మండల వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు అన్నారు ప్రజల సమస్యలు పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నారని సర్పంచ్ లు అన్నారు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ లలో గ్రామ సభలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు తమ కు కావలసిన వసతుల గురించి అడిగారు. అవకాశాలని బట్టి అన్ని సమస్యలను త్వరగా పరిష్కరించుకుందాం అని సర్పంచులు హమి ఇచ్చారు.

ఈ కార్యక్రమం లో సర్పంచులు గుంటకండ్ల రామచంద్రారెడ్డి బయ్యం సుజాత వెంకన్న ఆకుల బుచ్చిబాబు వడ్డే వెంకన్న వంగూరి దామోదర్ ఎర్ర సావిత్రి యాదగిరి అంబటి శ్రీను బుక్క శ్రీనివాస్ కమటం సునీత శ్రీనివాస్ గుగులోతు రవీందర్ ఎస్ కె షాహిన్ వలి దోమలపెల్లి సంధ్య గోవర్ధన్ గండమల్ల లక్ష్మయ్య తరాల కవిత ఆంజనేయులు ఉపసర్పంచులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ పాపన్న గౌడ్ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేద్దాం



**నాగారం, ఏప్రిల్ 2 :**
బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని నాగారం మండల గౌడ సంఘం అధ్యక్షుడు బాలగాని మురళి పిలుపునిచ్చారు. గురువారం సర్దార్ పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా నాగారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలోని వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బందారపు ఉపేందర్, చిప్పలపల్లి సోమయ్య, నాతి మధు, అనంతుల సోమశేఖర్, అనంతుల వెంకటయ్య ,మహేష్, అనంతులనవీన్, పాముకుంట్ల ఉమేష్, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ మధ్య రైల్వేకు 21,211 కోట్ల ఆదాయం

**- జోన్ చరిత్రలో ఇదే రికార్డు - జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ**





**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2**
దక్షిణ మధ్య రైల్వే 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.21,211.92 కోట్ల ఆదాయం ఆర్జించిందని జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. ఇది జోన్ చరిత్రలోనే రికార్డుస్థాయి ఆదాయమని, గత ఏడాదితో పోలిస్తే 3.12% అధికమని చెప్పారు. కాజీపేట రైల్వే డివిజన్ ప్రతిపాదనేదీ తమ వద్ద లేదని పేర్కొన్నారు. కొత్త డివిజన్ ఏర్పాటు చాలా క్లిష్టతరమైనదని, జోన్ పరిధిలో కొత్త డివిజన్ ఏర్పాటు అవశ్యకత కనిపించడం లేదని చెప్పారు. సరుకు రవాణాలో, ప్రయాణికులకు మెరుగైన సేవల ద్వారా దక్షిణ మధ్య రైల్వేకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచి అద్భుత విజయాలు సాధించామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 28.65 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చామని, 14.79 కోట్ల టన్నుల సరుకు రవాణా చేశామని, ఇప్పటివరకు ఇదే అత్యధికమన్నారు. సరుకు రవాణాతో రూ.13,835 కోట్లు ఆర్జించిందని తెలిపారు. ప్రయాణికుల విభాగం నుంచి రూ.6,235.37 కోట్ల ఆదాయం సంపాదించిందని, ఇది గత ఏడాది వచ్చిన రూ.5,714.83 కోట్ల కంటే 9.11 శాతం ఎక్కువని వివరించారు. అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద 5 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. 72 రైల్ అండర్ బ్రిడ్జిలు, 27 రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణంతో 65 లెవల్ క్రాసింగ్ గేట్లు తొలగించామని తెలిపారు.

# బచ్చలి కూర పెరటి మొక్కే కావచ్చు..

## దీని లాభాలు తెలిస్తే అస్సలు వదలరు !



ఆకుకూరల్లో రారాజు అనగానే వెంటనే గుర్తొచ్చేది పాలకూర. అయితే, పోషకాల విషయంలో దానికి ఏమాత్రం తీసిపోనిది, మన పెరట్లో పెరిగే బచ్చలికూర. చాలా మంది దీనిని సాదాసీదా ఆకుకూరగా భావిస్తారు. కానీ, బచ్చలి కూరలో ఉన్న పోషకాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. బచ్చలి కూర రెండు రకాలు. తీగ బచ్చలి, కాడ బచ్చలి. ఎక్కువగా కాడ బచ్చలి మనకి దొరుకుతుంది. తీగ బచ్చలిని ఇంటి పెరట్లో పెంచుకో వచ్చు. బచ్చలి కూరతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో తెలుసుకుందాం.

**1. రక్త హీనతకు దివ్య ఔషధం:**
రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారు, నీరసంగా ఉన్నవాళ్లు బచ్చలి కూరను డైట్‌లో చేర్చుకుంటే ఎంతో మంచిది. ఇందులో ఉండే ఐరన్ కంటెంట్ ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని పెంచి, రక్తహీనత సమస్యను దూరం చేస్తుంది.

**2. జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది:**
బచ్చలికూరలో ఫైబర్ (పీచు పదార్థం) అధికంగా ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని వదిలించి, జీర్ణక్రియను సాఫీగా చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు పంపడంలో కీలకపాత్ర పోషిస్తుంది.

**3. కంటి చూపు పదిలం:**
కంప్యూటర్లు, ఫోన్లు బాగా వాడే వారికి కళ్లు త్వరగా అలసిపోతాయి. అలాంటి వారు బచ్చలి కూర డైట్‌లో చేర్చుకుంటే ఎంతో మంచిది. దీనిలో ఉండే విటమిన్ ఎ, బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపరుస్తాయి. రేచీకటి సమస్యలు రాకుండా అడ్డుకుంటాయి.

**4. ఎముకల బలం:**
వయసు పెరిగే కొద్దీ వచ్చే ఎముకలబలహీనతను తగ్గించడంలో బచ్చలి కూర తోడ్పడుతుంది. ఇందులో ఉండే క్యాల్షియం, విటమిన్ కె ఎముకలను ఉక్కులా మారుస్తాయి.

**5 చర్మ సౌందర్యం:**
ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. ముఖంపై ముడతలు రాకుండా నివారించి, యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.

# మృగ్యమైన మావలంకర్ వారసత్వం

'లోక్‌సభ తొలి స్పీకర్ జీవీ మావలంకర్, రెండవ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్, రాజ్యసభ తొలి చైర్మన్, ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్లమెంటరీ సంస్థల పనితీరుపై గొప్ప ప్రభావాన్ని చూపారు. నిబంధనలు, విధానాలు, సంప్రదాయాలు, పద్ధతులను రూపొందించడంలో వారు ముందాగా, నిష్పాక్షికంగా వ్యవహరించేవారు. రాజ్యసభలో జనసంఘ్ కు ప్రాతినిధ్యం ఉండకపోయినా నేను అతిథుల గ్యాలరీల నుంచి అక్కడి చర్చలను తిలకించేవాడిని. ప్రశ్నోత్తరాల సమయం, వాయిదా తీర్మానాలు, బిల్లులు, తీర్మానాలు, స్థాయీ సంఘాలు, సావధాన నోటీసులు, సభ్యుల హక్కులు మొదలైన వాటన్నింటి గురించి నేర్చుకునే అవకాశం నాకు వారి వల్లే లభించింది. ప్రతిపక్ష బెంచీల్లో కూర్చున్న హేమాహేమీలు కూడా అధికార పక్షం వైపు కూర్చున్న సభ్యులతో సమానంగా అనర్గళంగా మాట్లాడేవారు. ప్రతిపక్షాల హక్కులకు సంరక్షకుడుగా స్పీకర్ నిజాయితీతో వ్యవహరించేవారు. ఈ ఉత్తమ సంప్రదాయాల వల్లే భారత దేశ ప్రజాస్వామ్యం పరీక్షలకు తట్టుకుని నిలబడింది. అంతర్జాతీయంగా తన ప్రతిష్ఠను నిలబెట్టుకుంది' -- ఈ మాటలు ఎవరివో కాదు, భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన లాల్‌కృష్ణ ఆడ్వాణీవి. తన ఆత్మకథ 'నా దేశం నా జీవితం' లో ఒకప్పటి పార్లమెంటరీ ప్రమాణాల గురించి ఆడ్వాణీ వివరంగా రాశారు. ఏ ప్రమాణాలైనా వ్యక్తులు నిలబెడితేనే సుస్థిరంగా ఉంటాయి. వ్యక్తులు తమ ప్రయోజనాలకోసం ప్రమాణాలను పణంగా పెడితే ఉదాహరణగా చెప్పుకోవడానికి ఏ ప్రమాణాలూ నిలువవు. సమాజంలో దిగజారుతున్న విలువలు పార్లమెంటరీ చర్చలను ప్రభావితం చేస్తే మన ప్రజాస్వామ్య పతనం ఎలా ఉంటుందో చెప్పేందుకు నేడు చట్టసభలు సాగుతున్న తీరే నిదర్శనం. 'మీరు మాకు మార్గనిర్దేశనం చేయండి, మేము దారి తప్పితే అవసరమైతే మాకు బుద్ధి చెప్పండి. మా ప్రవర్తనను సరిదిద్దండి' అని తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ లోక్‌సభ తొలి స్పీకర్ గణేశ్ వాసుదేవ్ మావలంకర్ ను అభ్యర్థించారు. ఎప్పుడైనా తీవ్ర విభేదాలు నెలకొన్నప్పుడు ప్రధాన మంత్రి, స్పీకర్, కార్యదర్శి కలసి కట్టుగా సంప్రదించుకుని సమస్యను పరిష్కరించేవారు. ఒక రోజు సభలోనే మావలంకర్, నెహ్రూ మధ్య వాగ్వివాదం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఒకే రోజు రెండోసారి ప్రకటన చేయాలని నెహ్రూ సంకల్పించారు. అయితే అలా మాట్లాడడం నిబంధనల ప్రకారం కుదరదని మావలంకర్ స్పష్టం చేశారు. నెహ్రూ సరేనంటూ వెనక్కు తగ్గారు. ఆర్డినెన్స్ లను మావలంకర్ తీవ్రంగా వ్యతిరేకించేవారు. అరుదైన పరిస్థితుల్లో మినహా ఆర్డినెన్సులు జారీ చేయవద్దని స్పష్టంగా చెప్పేవారు. ఈ విషయమై ప్రధానికి లేఖ రాసేవారు. న్యాయపరమైన సందేహం వస్తే స్వయంగా అటార్నీ జనరల్ ను సంప్రదించేవారు. స్పీకర్ న్యాయమూర్తిగా వ్యవహరించాలని మావలంకర్ చెప్పేవారు. నెహ్రూ కూడా మావలంకర్ కు సమున్నత గౌరవం ఇచ్చేవారు. పార్లమెంటరీ కమిటీల్లో తమ నిర్ణయాలను శల్యపరీక్ష చేస్తున్నారని అధికారులు నెహ్రూకు ఫిర్యాదు చేసినప్పుడు దాని గురించి మాట్లాడడం తన పరిధిలో లేదని, స్పీకర్ నే సంప్రదించమని సలహా ఇచ్చేవారు. అనేక విషయాలకు సంబంధించి మావలంకర్ రూపొందించిన నియమ నిబంధనలే ఇప్పటికీ ఉన్నాయి. 'పాలక, ప్రతిపక్షాల మధ్య సరైన సమతుల్యత ఉండేలా చేస్తూ, సభను సమర్థంగా నిర్వహిస్తూ, ప్రజల ప్రయోజనాలను కాపాడిన సభాపతి జీవీ మావలంకర్ 'అని లోక్ సభ తొలి సెక్రటరీ జనరల్ ఎమ్ఎన్ కౌల్ అన్నారు. పార్లమెంటు ప్రభుత్వ అధికారాలకు లోబడి ఉండకూడదని స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించాలని నిర్ణయించిన మావలంకర్ గుజరాత్ నుంచి ఎన్నికైన సభ్యుడు కావడం గమనార్హం. మావలంకర్ మరణం తర్వాత స్పీకర్ అయిన అనంతశయనం అయ్యంగార్ కూడా అదే దారిలో నడిచారు. తిరుపతి సమీపంలోని తిరుచానూర్ లో వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన అయ్యంగార్ లోక్ సభను నిష్పాక్షికంగా నడిపించేవారు. 'ఒక నియంత పాలనలో గానీ లేదా సంపూర్ణ రాచరిక పాలనలో గానీ పౌరుల జీవనానికి, స్వేచ్ఛకు ఎలాంటి రక్షణ ఉండదు. నియంత మంచివాడైతేనే ప్రజలు క్షేమంగా ఉంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థ లో పాలకులు తమ వర్గాలకే అనుకూలంగా వ్యవహరిస్తూ చట్ట సభలో తక్కువ సంఖ్యలో ఉన్న వారిని అణిచివేసే ప్రమాదం ఉంది. ఈ ధోరణులను కఠినంగా నియంత్రిస్తూ తక్కువ సంఖ్యలో ఉన్న సభ్యుల ప్రయోజనాలను కాపాడగలిగిన వ్యక్తి సభాధ్యక్షుడు (స్పీకర్) మాత్రమే' అని అయ్యంగార్ ఒక సందర్భంలో స్పష్టం చేశారు. ఇంగ్లీషులో హిరేన్ ముఖర్జీ (సీపీఐ), హిందీలో అటల్ బిహారీ వాజపేయి( జనసంఘ్)ను మించిన వక్తలు లేరని ఆయన కొనియాడేవారు. సరైన సంఖ్యాబలం లేనందువల్ల ప్రతిపక్ష నాయకుడంటూ లేకపోయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులందరికీ అయ్యంగార్ ఎంతో గౌరవం ఇచ్చి వారు మాట్లాడేందుకు వీలు కల్పించేవారు. రెండవ లోక్ సభలో అధికార ప్రతిపక్ష సభ్యులందరూ ఏకగ్రీవంగా అయ్యంగారే మళ్లీ స్పీకర్ కావాలని ప్రతిపాదించారంటే ఆయన సంపాదించిన గౌరవం, నిలబెట్టిన ప్రమాణాలే కారణం. 1972లో తిరుపతి నుంచి ఒక దళిత క్రైస్తవ ఎమ్మెల్యేను నిలబెట్టినప్పుడు ఆయనను గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థన మేరకు అనంతశయనం అయ్యంగార్ రంగంలోకి దిగారు. 'విశిష్టాద్వైతంలోనే లౌకిక వాదం జీర్ణించుకుపోయింది' అంటూ ఆయన తనను ప్రశ్నించిన తన వర్గీయులకు జవాబు చెప్పి ఆ ఎమ్మెల్యేను గెలిపించారు. అయ్యంగార్ తర్వాత స్పీకర్ అయిన సర్దార్ హుకం సింగ్ తొలి సారి నెహ్రూ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాలను ఆమోదించారు. ప్రభుత్వం కంటే పార్లమెంట్ ఆధిక్యతే ఎక్కువ అని ప్రకటించారు. ఆయన తర్వాత స్పీకర్ అయిన నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన రోజే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు అనుమతించారు. నాల్గవ లోక్‌సభ అనంతరం పార్లమెంటరీ ప్రమాణాల పతనం ప్రారంభమయింది. ఎమర్జెన్సీలో పార్లమెంటరీ కార్యకలాపాలను కనీవినీ ఎరుగని రీతిలో సెన్సార్ చేసినప్పటికీ ఉభయ సభల అధ్యక్షులు మౌనం పాటించారు. రెండు సార్లు లోక్ సభ స్పీకర్ గా ఉన్న జీఎస్ ధిల్లాన్‌ను ఇందిరాగాంధీ రాజీనామా చేయించి అదే రోజు షిప్పింగ్ మంత్రిగా నియమించారు. చట్టసభలకు ప్రభుత్వాలు లోబడి ఉండే విధంగా ఆయన రూలింగ్ లు ఇవ్వడమే అందుకు కారణం కావచ్చు. ఒక ప్రాంతీయ పార్టీ నుంచి మొదటి సారి స్పీకర్ పదవిని అధిష్ఠించిన బాలయోగి స్పీకర్ పదవి తటస్థతను ఎంతగా కాపాడారంటే ఆయన హయాంలోనే వాజపేయి ప్రభుత్వం కేవలం ఒక్క ఓటుతో పడిపోవడమే అందుకు నిదర్శనం. ఆ తర్వాత స్పీకర్ పదవిని నిర్వహించిన మహిళా నేతలు మీరాకుమార్, సుమిత్రా మహాజన్ హయాంలలో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు తలెత్తేవి. తెలంగాణ ఆందోళన మూలంగా మీరాకుమార్ పని కత్తిమీద సాములా మారితే నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత అధికార పార్టీకి, ప్రతిపక్షాలకూ మధ్య తలెత్తిన ఘర్షణాత్మక వైఖరి సుమిత్రా మహాజన్ ను ఇబ్బందుల్లో పడవేసేది. అప్పటినుంచీ ఈ ఘర్షణ మరింత తీవ్రతరం కావడం, సుమిత్ర తర్వాత స్పీకర్ అయిన ఓం బిర్లా కూడా తరచు నిస్సహాయ పరిస్థితుల నెదుర్కోవలసి వస్తోంది. గత ఆరేళ్లలో మన పార్లమెంటరీ వ్యవస్థ ప్రమాణాలు బాగా దిగజారిపోతూ వస్తోన్నాయి. తాజాగా కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడనీయనందుకు ప్రతిపక్షాలు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. ఇది మన ప్రజాస్వామ్య దుస్థితికి పరాకాష్ఠ. సైనిక దళాల మాజీ ప్రధానాధికారి మనోజ్ ముకుంద్ నరవణే తన ఆత్మకథ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' లో గల్వాన్ ఘర్షణల గురించి రాసిన విషయాలపై చర్చించడానికి అనుమతించి ఉంటే, అందుకు ప్రభుత్వం సమాధానమిచ్చి ఉంటే ఏమి జరిగేది? ప్రజలకు వాస్తవాలను బేరీజు వేసుకునేందుకు అవకాశం లభించేది. అలా కాకుండా అడ్డుకున్నందుకు ప్రతిపక్షాలు పార్లమెంట్‌ను స్తంభింపచేశాయి. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై పూర్తి స్థాయి చర్చ జరగకుండానే, లోక్‌సభలో ప్రధానమంత్రి మాట్లాడకుండానే పార్లమెంట్ సమావేశాలు నీరు కారిపోయే పరిస్థితి ఏర్పడింది. పైగా మోదీపై మహిళా ఎంపీలు దాడి చేయబోతున్నారని తనకు తెలిసిందని స్పీకర్ స్వయంగా చెప్పడం ఒక విచిత్ర పరిణామం. నిజానికి ఈ మొత్తం పరిస్థితికి ప్రభుత్వ, ప్రతిపక్షాలు పట్టువిడుపులతో వ్యవహరించకపోవడం, పార్లమెంట్‌ను తమ రాజకీయ క్రీడకు ఉపయోగించుకోవడమే కారణం. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ఒకరికి మరొకరిపై పూర్తిగా గౌరవం లోపించిన ఈ పరిస్థితుల్లో స్పీకర్ నిష్పాక్షికంగా ఉంటారని, రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తారని ఎవరూ అనుకోరు. తద్వారా స్పీకర్ కూడా గౌరవం కోల్పోవడం స్పష్టంగా కనిపిస్తోంది. 'స్పీకర్ మొత్తం సభకు ప్రాతినిధ్యం వహిస్తారు. సభ గౌరవాన్నీ, స్వేచ్ఛనూ ప్రతిఫలించేది స్పీకరే. సభ అంటే దేశం కనుక స్పీకర్ దేశంలో స్వేచ్ఛకు చిహ్నంగా ఉంటారు. కనుక ఆ పదవి గౌరవప్రదమైనది. ఈ స్థానంలో అత్యుత్తమ సామర్థ్యం, నిష్పాక్షికత గల వ్యక్తులు బాధ్యతలు నిర్వర్తించాలి' అని నెహ్రూ అన్నారు. కానీ అప్పటి రోజులకూ, ఇప్పటి రోజులకూ పోల్చడం సాధ్యం కాదు. నాడు అధికారంలో ఉన్న వారు స్వయంగా ప్రమాణాలను నిర్దేశించి భావితరాలకు ఆదర్శంగా ఉండాలని భావించేవారు. వికసిత్ భారత్ కోసం దేశం తహతహలాడుతున్న ఈ సమయంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రమాణాలను కూడా ఫలానా తేదీ లోపు కాపాడాలనే విషయమై నేతలు తమలో తాము చర్చించుకోవడం అవసరం.

# ప్రవాసుల ప్రాణాలను హరిస్తున్న మనో రుగ్మతలు

ఆశల ఆరాటంలో జీవనపోరాటం విషాదాంతమవడం ఎంత బాధాకరం! దురదృష్టవంతులు అయిన కొంతమంది ప్రవాస భారతీయుల గురించి నేను ప్రస్తావిస్తున్నాను. కన్నవారికి, కట్టుకున్నవారికి దూరంగా ఉండే ప్రవాసుల జీవితాలు యాంత్రికంగా సాగిపోతుంటాయి. అనురాగాలు, ఆప్యాయతలు కరువై ఎంతో మంది ప్రవాసులు మానసిక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. పట్టుమని మూడు పదుల వయసు కూడా లేని యువకులు కన్న ఊరులో ఇల్లు, ఇంకా కొద్దిపాటి ఆస్తులు సమకూర్చుకునేందుకై అష్టకష్టాలు పడి ఈ సుదూర సీమలకు వచ్చి బతుకు పోరులో అలసిపోతున్న తీరును చూస్తే జాలి కలుగుతోంది. రేయింబవళ్ల రెక్కల కష్టం తరువాత నెలాఖరులో ఆదాయ వ్యయాల లెక్కలు చూసుకుంటూ నైరాశ్యంలోకి జారిపోతున్నారు. ఇది వారి మానసిక సమతుల్యతను దెబ్బతీసి శారీరక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. సామాజిక మాధ్యమాలలో-- సంఘ జీవన పోకడలపై వ్యాఖ్యానాలు, విమర్శలు చేయడంలో వీరు చలాకీగా ఉంటారు. అయితే స్వీయ కుటుంబ పరిస్థితులపై తమ అంతరంగంలోని ఆవేదనను ఎవరికీ చెప్పుకోలేక మానసికంగా నలిగిపోతున్న ప్రవాసులు తక్కువ మందేమీ కాదు. అంతులేని ఆ మనోవ్యథల భారంతో కొంతమంది జీవితాలు అర్ధంతరంగా ముగిసిపోతున్నాయి. అవి సహజ మరణాలే, అయితే హైపర్ టెన్షన్‌తో సంభవిస్తున్న విషాదాలవి. గల్ఫ్ దేశాలలో ఉద్యోగులు, కార్మికులుగా ఉన్న వారిలో సంభవిస్తున్న ఇటువంటి సహజ మరణాల సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగిపోయింది. గాడి తప్పుతున్న మానసిక ఆరోగ్య పరిస్థితులకు అవి అద్దం పడుతున్నాయి. ఆర్థిక సమస్యలు ఉన్న వారు సరే, జీవన పరిస్థితులు సవ్యంగా ఉన్న వారు సైతం మానసిక కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడడమే దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఇరవై నాలుగు సంవత్సరాల వరికుప్పల రాకేశ్ ఇటీవల దుబాయిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక అసమానతల భారతంలో సగటు మనిషి జీవన పోరాటానికి ఈ దురదృష్టకర యువకుడు ఒక ప్రతీక. రాకేశ్ బాల్యంలోనే తండ్రిని కోల్పోయాడు. తన కుటుంబ భవిష్యత్తు కొరకు గల్ఫ్‌కు వచ్చాడు. రాజన్న సిరిసిల్లా జిల్లాలోని వీర్నపల్లి అనే ఒక చిన్న గ్రామంలో తను నివసించడానికి రెండు గదుల సొంత ఇంటి నిర్మాణం మాత్రమే అతడి లక్ష్యం. ఆ లక్ష్యంతో ఎడారి దేశానికి వచ్చిన రాకేశ్, ఆశించిన స్థాయిలో సంపాదించలేకపోయాడు. సెలవు రోజు రాత్రి మిత్రులతో కలిసి ఉల్లాసంగా గడిపాడు. మిత్రులు అందరూ వెళ్ళిన తర్వాత తన పరిస్థితిపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతదేహం ఇంకా దుబాయిలోనే ఉంది. మారుమూల గ్రామంలో సొంత భూమిలో రెండు గదుల చిన్న ఇల్లు కట్టుకోవడానికి ఆ యువకుడు గల్ఫ్ బాటను ఎంచుకున్నా మనోరథంలో సఫలీకృతం కాలేక ప్రాణాలు పగొట్టుకున్నాడు. అతనే కాదు, కామారెడ్డి జిల్లాకు చెందిన మొహమ్మద్ యాసిన్ అనే 28 ఏళ్ళ యువ ఇంజనీర్ సమస్యల సుడిగుండం నుంచి బయటపడేందుకు మార్గం కనిపించక, మక్కా పుణ్యక్షేత్రంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయిన తరువాత లభించగా ఇంకా సౌదీలోనే ఉన్నది. ఇలాగే, బంధుమిత్రులు చాలా మంది ఉన్నా తన బాధలను ఎవరికీ చెప్పుకోలేకపోయిన హైదరాబాద్ మహిళ హుమేరా అఫ్రీన్ తన ముగ్గురు పసిపిల్లలను చంపి, తాను ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించి విఫలమయింది. ఆత్మహత్యాయత్నం చట్ట విరుద్ధం కావడంతో ఆమె ప్రస్తుతం జైలులో ఉంది. ఆర్థికంగానే కాకుండా, ఇతరత్రా అంతా సవ్యంగా ఉన్నప్పటికీ హైదరాబాద్ నగర శివారులో ఇటీవల ఒక గల్ఫ్ ప్రవాసుడి భార్య తన ఇద్దరు పిల్లలతో కలిసి రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడడం సమాజానికి అనేక సవాళ్ళు విసిరింది. మానసిక సమస్యలతో సంభవిస్తున్న విషాద మరణాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. భారత జనాభాలో 15 శాతం మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. ఆర్థిక అసమానతలు ఆ రుగ్మతలకు ప్రధాన కారణమని ప్రభుత్వ నివేదికలే వెల్లడిస్తున్నాయి. కన్న ఊరు, మాతృదేశం దాటిన తరువాత ఆ మనోరుగ్మతలు ఎడారి ఏకాంతంలో మరింతగా పెచ్చరిల్లుతున్నాయి. మనిషి స్మార్ట్ ఫోన్‌తో తనకు తాను ఎంతగా మమేకమైనా, మానసిక శాంతి కొరవడిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఒక కాకి చనిపోతే ఎన్నో కాకులు అక్కడికి చేరి గట్టిగా అరుస్తాయి.

# భయంతో నడిచిన బీఆర్ఎస్ పాలన !



'ఫోన్ ట్యాపింగ్' ఆరోపణలు నిజమైతే, బీఆర్ఎస్ పాలనలో పౌరుడు ఒక స్వేచ్ఛాయుత వ్యక్తిగా కాదు, ఒక అనుమానితుడిగా జీవించినట్టే! ఇదే పోలీస్ స్టేట్ మొదటి లక్షణం. ఇక్కడ "గోప్యత" అన్నది కేవలం ఫోన్ కాల్స్‌కు సంబంధించిన విషయం కాదు; వ్యక్తి ఆత్మ గౌరవానికీ, నిర్భయంగా మాట్లాడే స్వేచ్ఛకూ సంబంధించిన విషయం. తెలంగాణ రాజకీయ చరిత్రలో బీఆర్ఎస్ పాలన 'బలమైన ప్రభుత్వం'గా కాదు, 'భయంతో నడిచిన పాలన'గా గుర్తుకొచ్చే పరిస్థితి ఏర్పడింది. రాజకీయంగా ఇది కేసీఆర్ పాలనా శైలిని బహిర్గతం చేస్తుంది. ఆయన పాలన వ్యవస్థలపై కాదు, వ్యక్తులపై ఆధారపడి సాగింది. పోలీస్, ఇంటెలిజెన్స్, టెలికాం తదితర వ్యవస్థలన్నీ ఒకే శక్తి కేంద్రానికి లోబడి పనిచేశాయన్న ఆరోపణలు బీఆర్ఎస్‌ను ఒక పార్టీలా గాక, ఒక నెట్‌వర్క్ ఆఫ్ పవర్‌లా చూపిస్తున్నాయి. ఈ నెట్‌వర్క్‌లో రాజకీయ నాయకులు, పోలీస్ అధికారులు, టెక్నాలజీ మధ్యవర్తులు ఒకే లక్ష్యానికి పనిచేశారా అన్నదే అసలు దర్యాప్తు ప్రశ్న. ఈ కేసులో అత్యంత కీలకమైనది డిజిటల్ ఫోరెన్సిక్ ఆధారాలు. ఫోన్ ట్యాపింగ్ నేరం "ఆదేశం ఇచ్చారా లేదా?" అనే రాజకీయ ప్రశ్న కాదు; "ఎవరి ఐపీ అడ్రస్ నుంచి?" "ఏ సర్వర్ ద్వారా?" "ఏ టెలికాం గేట్‌వేలో?" అనే శాస్త్రీయ ప్రశ్న. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీనిని మీడియా ట్రయల్‌గా కాకుండా, డేటా ట్రయల్‌గా తీసుకెళ్తోంది. ఇది కాంగ్రెస్ పాలనలో చట్టం పైనే రాజకీయాలు ఉంటాయన్న సంకేతం. బీఆర్ఎస్ దీనిని 'రాజకీయ వేధింపులు' అని వాదిస్తున్నా, ఒక నిజం మారదు, రాజకీయ వేధింపులకు డిజిటల్ లాగ్స్ ఉండవు. నేరాలకు ఉంటాయి. ఆ లాగ్స్ ఎక్కడున్నాయి? ఎవరు తుడిచేశారు? ఎందుకు తుడిచేశారు? ఈ మూడు ప్రశ్నలే కేసీఆర్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించవచ్చు. ఇక్కడ మరో కీలక కోణం ఉంది: అది మీడియా స్వేచ్ఛ. జర్నలిస్టుల కాల్స్ ట్యాప్ చేయడం అంటే, అది వార్తలను కాదు, నిజాన్ని ట్యాప్ చేయడమే. ఇది ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రమాదకరమైన చర్య. ఎందుకంటే మీడియా భయపడే దేశంలో ప్రజలు పూర్తి అంధకారంలో ఉంటారు. తెలంగాణలో ఒక దశలో మీడియా మౌనంగా మారిందంటే, దానికి ఈ నిఘా సంస్కృతీ కారణమే. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కేసును ముందుకు తీసుకెళ్తుండటంతో ఒక కొత్త రాజకీయ ప్రమాణం ఏర్పడుతున్నది: గత పాలకులు కూడా చట్టానికి లోబడి ఉంటారు. ఇది కాంగ్రెస్‌కు ఒక నైతిక మూలధనం. ప్రతీకారం



# మూడు కాలాల్లో సాగే కథ

'ఇండియాలో తొలి మోటోక్రాస్ ఫిల్మ్ 'బైకర్'. చాలా కొత్తకథ. దర్శకుడు అభిలాష్ ఫ్రెష్ కంటెంట్‌తో ఈ సినిమాను తెరకెక్కించాడు. ఇది హై అడ్రినలిన్, హై ఆక్టేన్ ఫిల్మ్. ఇది నాకు వినగానే నచ్చిన కథ. అందుకే రిజల్ట్ కోసం ఎక్సైటెడ్‌గా ఉన్నాను' అని కథానాయిక మాళవిక నాయర్ అన్నారు. శర్వానంద్‌కు జోడీగా ఆమె నటించిన చిత్రం 'బైకర్'. డా.రాజశేఖర్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రానికి అభిలాష్‌రెడ్డి దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 3న విడుదల కానుంది. మాళవిక నాయర్ బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 'కథకు వంతెనలాంటి పాత్రలో నేను కనిపిస్తాను. ఈ కథ మూడు కాలాల్లో సాగుతుంది. ప్రతి కాలంలోనూ నా పాత్ర ఇన్వాల్వ్‌మెంట్ ఉంటుంది' అని చెప్పింది మాళవిక నాయర్. ఇందులో తండ్రీకొడుకుల ఎమోషన్ ప్రత్యేకంగా ఉంటుందని, అద్భుతమైన ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న సినిమా ఇదని మాళవిక పేర్కొన్నారు. సాంకేతికంగా అన్ని విధాలా 'బైకర్' ఆకట్టుకుంటుందని, ఒక్క మాటలో చెప్పాలంటే స్ఫూర్తినిచ్చే ఉత్కంఠభరిత చిత్రం 'బైకర్' అనీ మాళవిక నాయర్ అన్నారు.

ఇకపై పర్సంటేజీ విధానంలో ప్రదర్శనలు..

# తెలంగాణ ఎగ్జిబిటర్ల కీలక నిర్ణయం



తెలంగాణ సినీ ఎగ్జిబిటర్ల సుదీర్ఘ కాల డిమాండ్‌కు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. అద్దె విధానానికి స్వస్తిపలికి పర్సంటేజీ విధానంలో సినిమాల్ని ప్రదర్శించాలని ఎగ్జిబిటర్లు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం దిశగా గురువారం కీలక పరిణామం చేటుచేసుకుంది. అద్దె విధానాన్ని రద్దు చేస్తూ మల్టీప్లెక్స్‌ల తరహాలో ఇకపై పర్సంటేజీ ఆధారిత రెవెన్యూ విధానంలో సినిమాలను ప్రదర్శించాలని హైదరాబాద్ నగరంలోని 23 సింగిల్‌స్క్రీన్ల థియేటర్ల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. ఏప్రిల్ 3 నుంచి ఈ విధానం అమలులోకి రానుందని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. దీని ప్రకారం సినిమా ప్రదర్శితమైన తొలివారం 60శాతం, రెండోవారం 50శాతం, మూడోవారం నుంచి 40 శాతం ఎగ్జిబిటర్లకు సినిమా వసూళ్లలో వాటా దక్కనుంది. 23 మంది ఎగ్జిబిటర్లు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను సంప్రదించి డిస్ట్రిబ్యూటర్లతో చర్చలు జరిపారు. హైదరాబాద్‌లోని 23 ప్రీమియం సింగిల్ స్క్రీన్లలో ప్రేక్షకులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తున్నామని, థియేటర్ల నిర్వహణకు పెద్ద మొత్తంలో ఖర్చు పెడుతున్నామని ఎగ్జిబిటర్లు వివరించారు. ప్రస్తుతం ఉన్న అద్దె విధానంలో నిర్వహణ కష్టమవుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో పర్సంటేజీ ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శించాలన్న ఎగ్జిబిటర్ల అభ్యర్థనను డిస్ట్రిబ్యూటర్లు అంగీకరించారు. నగరంలోని 23 థియేటర్లే కాకుండా తెలంగాణలోని అన్ని సింగిల్ స్క్రీన్‌లలో విడతల వారిగా పర్సంటేజీ విధానాన్ని అమలుపరుస్తామని ఎగ్జిబిటర్లు తెలిపారు. మార్చి 11న బెంగళూరులో జరిగిన దక్షిణ భారత ఎగ్జిబిటర్ల సమావేశంలో కూడా పర్సంటేజీ విధానంపై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారని, తెలుగు రాష్ట్రాలు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని సింగిల్ స్క్రీన్లు పర్సంటేజీ విధానాన్ని అనుసరిస్తున్నాయని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ తెలియజేసింది.



# డెకాయిట్ ప్రేమగాథ

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న క్రైమ్ డ్రామా 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, సెన్సార్ పూర్తయిందని, యు.ఏ. సర్టిఫికెట్ లభించిందని మేకర్స్ తెలిపారు. 13 ఏళ్ల విరామం తర్వాత కలుసుకున్న మాజీ ప్రేమికుల జీవన ప్రయాణానికి అద్దం పట్టే చిత్రమిదని, హృద్యమైన ప్రేమకథ.. ఇంటెన్స్ యాక్షన్ కలబోతగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని దర్శకుడు పేర్కొన్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచాయని, అడివి శేష్ పాత్రలో భిన్నకోణాలుంటాయని ఆయన అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

# జానపద కథలాంటి సినిమా..




సంగీత్‌శోభన్, నయన్‌సారిక జంటగా నటించిన చిత్రం 'రాకాస'. మానసశర్మ దర్శకురాలు. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. గ్లింప్స్ నుంచే ఈ సినిమాపై భారీ హైప్ ఏర్పడిందని, ఆద్యంతం హాస్యప్రధానంగా సాగే చిత్రమిదని, ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేస్తారని చిత్ర నిర్మాత నిహారిక కొణిదెల చెప్పింది. ఫాంటసీ, అడ్వెంచర్, ఫన్ కలబోసిన సినిమా ఇదని, రామ్‌చరణ్ ఈ సినిమా గురించి గొప్పగా మాట్లాడటం ధైర్యాన్నిచ్చిందని హీరో సంగీత్‌శోభన్ అన్నారు. మన జానపద కథలు ఈ తరం వారు అర్థం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశామని, అందమైన చందమామ కథలా ఆకట్టుకుంటుందని దర్శకురాలు మానసశర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురురోలు, సంగీతం: అనుదీప్‌దేవ్, నిర్మాతలు: నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్, రచన-దర్శకత్వం: మానసశర్మ.

# డిసెంబర్‌లో ఫౌజీ?



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న దేశభక్తి ప్రధాన చిత్రం 'ఫౌజీ'. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. ఇందులో ప్రభాస్ బ్రిటీష్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు దేశభక్తి, ప్రేమ, త్యాగం అంశాలతో ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఈ పాన్ ఇండియా సినిమా విడుదల గురించి ప్రభాస్ అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఆగస్ట్ 15న రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారని వార్తలొచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఇప్పటికే ఈ సినిమా 70 శాతం చిత్రీకరణ పూర్తిచేసుకుంది. మంచి క్వాలిటీ అవుట్‌పుట్‌ను దృష్టిలో పెట్టుకొని పోస్ట్‌ప్రొడక్షన్ కోసం మరింత సమయాన్ని వెచ్చించే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు తెలిసింది. రిలీజ్ డేట్‌కు సంబంధించిన వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్.